నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I నల్లగొండ, ఆదివారం 18 మే 2025 YADADRI BHUVANAGIRI

## కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల ధర్నా



భువనగిరికలెక్టరేట్, మే 17 : దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులు ఆందోళనకు దిగారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకట్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాల్లో దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో ఉన్న వినతిపత్రాన్ని కలెక్టరేట్ పరిపాలనాధికారి జగన్మోహన్ ప్రసాద్‌కు అందించారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఉపేందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామి, కోశాధికారి లలిత, ఉపాధ్యక్షురాలు బాబు, సహాయ కార్యదర్శి శ్యాంసుందర్, శివయ్య పాల్గొన్నారు.

# యువ వికాసం వెరీ స్లో..




## బ్యాంకు వెరిఫికేషన్‌లో తీవ్ర జాప్యం

- నల్లగొండ జిల్లాలో 1.01శాతం.. సూర్యాపేటలో 15.71శాతమే పూర్తి
- యాదాద్రిలో 88.34శాతం పరిశీలన
- 20లోగా జిల్లా కమిటీకి అర్హుల జాబితా సాధ్యమేనా?
- ఆ తర్వాత జిల్లా కమిటీ వడబోత.. ఇన్‌చార్జ్ మంత్రికి లిస్ట్
- జూన్ రెండున అందరికీ రుణాలు అందేనా?
- టైమ్ లేదని పైలట్ గ్రామాలను తెరపైకి తెస్తారా అనే అనుమానాలు

**నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాసం పథకం నత్తనడకన సాగుతున్నది. అనేక కొర్రీలతో అమలు చేస్తున్న స్కీమ్ పరిశీలన అటు అధికారులు.. ఇటు బ్యాంకుల్లో నిర్లక్ష్యం కనిపిస్తున్నది. యాదాద్రి భువనగిరి జిల్లాలో కాస్త మెరుగ్గా ఉన్నా.. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో పరిస్థితి దారుణంగా ఉంది. దాంతో జూన్ రెండున అందరికీ రుణాలు అందుతాయో, లేవా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.**

– యాదాద్రి భువనగిరి, మే 17 (నమస్తే తెలంగాణ)

రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సబ్సిడీతో కూడిన ఆర్థిక సాయం కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని తీసుకొచ్చారు. రేషన్ కార్డు కలిగిన బడుగు, బలహీన వర్గాల యువతతోపాటు ఈబీసీ, మైనార్టీలకు రూ.50వేల నుంచి రూ. 4లక్షల వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఇందులో రూ.50వేల యూనిట్‌తోపాటు చిన్ననీటి పారుదల యూనిట్లు అయిన వ్యవసాయ బోర్లు, బావుల తవ్వకం వంటి వాటికి లక్ష వరకు వంద శాతం సబ్సిడీ ఉంది. రూ.లక్ష నుంచి రూ.4లక్షల లోపు వరకు వరకు 90శాతం నుంచి 70 శాతం వరకు సబ్సిడీతో బ్యాంక్ లింకేజీతో లోన్ ఇవ్వనున్నారు. ప్రతి నియోజకవర్గానికి 4,200 మందికి ఆర్థిక సాయం అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అర్హుల నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా గత నెల 14 వరకు దరఖాస్తులు స్వీకరించారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు 9,188 యూనిట్లను మంజూరు చేయగా, సగటున ఒక్కో యూనిట్‌కు ఐదు అప్లికేషన్లు వచ్చాయి. రూ.50వేలు, రూ.లక్ష యూనిట్లకు అంతంత మాత్రంగానే దరఖాస్తు చేసుకున్నారు. రూ. 2లక్షల నుంచి 4లక్షల యూనిట్ల వైపే యువత ఆసక్తి చూపించింది. బీసీ కార్పొరేషన్‌లో పోటీ ఎక్కువగా ఉంది.

### పరిశీలనలో జాప్యం

ఉమ్మడి నల్లగొండలో రాజీవ్ యువ వికాసానికి వివిధ వర్గాల నుంచి 1,78,060 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో నల్లగొండ జిల్లాలో 79,052, సూర్యాపేటలో 60,104, యాదాద్రి భువనగిరిలో 38,904 ఉన్నాయి. అప్లికేషన్లలో అర్హుల జాబితాను సిద్ధం చేయాల్సి ఉండగా, మండలాల్లో అధికారులు చేపట్టాల్సిన వెరిఫికేషన్ ప్రక్రియలో జాప్యం జరుగుతున్నది. డెస్క్ లెవల్‌లో మాత్రం కొంత మెరుగ్గానే ఉంది. కానీ డిఫాల్టర్, రుణాల పెండింగ్ తదితర పరిశీలనలకు బ్యాంక్ చేసే ప్రక్రియ చాలా నెమ్మదిగా ఉంది. ఈ నెల వరకు 14 వరకు అందిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లాలో బ్యాంక్ వెరిఫికేషన్ కేవలం 1.01శాతం మాత్రమే పూర్తయ్యింది. సూర్యాపేటలో 15.71శాతమే పరిశీలన జరిగింది. ఈ విషయంలో యాదాద్రి భువనగిరి మెరుగ్గా ఉంది. ఇక్కడ 88.34శాతం వెరిఫికేషన్ పూర్తయ్యింది.

### జూన్ రెండుకు సాధ్యమేనా?

ఎంపీడీఓ ఆధ్వర్యంలో గుర్తించిన అర్హుల జాబితాను కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా కమిటీకి ఈ నెల 20 వరకు పంపించాలి. జిల్లా కమిటీ 21 నుంచి 31 వరకు వడబోసి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రికి పంపిస్తుంది. ఆయన సిఫార్సు చేసిన జాబితాను ఫైనల్ కానుంది. జూన్ రెండున అందరికీ రుణాలు అందిస్తామని ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకుంటుండగా, ఆలోపు ప్రక్రియ పూర్తవుతుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో చాలా వెనుకంజలో ఉండడంతో ఎలా ముందుకెళ్తారు అనే సందిగ్ధం నెలకొంది. గతంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు అందరికీ ఇస్తామని చెప్పి.. తీరా ఆఖరికి సమయం లేదంటూ ఏవో కారణాలు చెప్పి మండలానికి ఒక్క గ్రామానికే పరిమితం చేశారు. ఇప్పటి వరకు మిగతా గ్రామాలకు వర్తింపజేయలేదు. ఇప్పుడు రాజీవ్ యువ వికాసం పథకాన్ని కూడా నాలుగు పథకాల మాదిరి చేస్తారా, లేదా అందరికీ ఇస్తారా అని దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు.

# హద్దు దాటి అక్రమ దందా

## బోనస్ కోసం ఆంధ్రా నుంచి సన్నధాన్యం

- బినామీ రైతుల పేరుతో ఇక్కడి ఐకేపీ కేంద్రాల్లో విక్రయం
- టాస్క్‌ఫోర్స్ అధికారుల అదుపులో వ్యాపారులు
- నిందితులంతా కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలే..

హాలియా, మే 17 : కాంగ్రెస్ పాలనలో అధికార పార్టీ నేతల అక్రమాలకు అడ్డు లేకుండా పోతున్నది. తాజాగా ప్రభుత్వం సన్న బియ్యానికి వచ్చే రూ.500బోనస్‌ను కాజేసేందుకు సరిహద్దులు దాటి అక్రమ దందాకు తెరలేపారు. ఆంధ్రాకు సరిహద్దున ఉండే నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని అనుముల, పెద్దవూర మండలాల్లోని పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు ధాన్యం వ్యాపారుల అవతారం ఎత్తి ఆంధ్రా నుంచి లారీల్లో ధాన్యం తీసుకువచ్చి ఇక్కడి అమ్మేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల ఆంధ్రా నుంచి వచ్చిన సన్నధాన్యం లారీలను సీజ్ చేయడంతో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం తెల్లవారుజామున జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు అనుముల గ్రామానికి చెందిన నలుగురు ధాన్యం వ్యాపారులతోపాటు పెద్దవూర మండలానికి చెందిన మరొకరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో ఒకరైన పిల్లి ఆంజనేయులు కాంగ్రెస్ పార్టీ క్రియాశీల కార్యకర్త కగా, ఆయన సతీమణి పిల్లి చంద్రకళ మొన్నటి వరకు హాలియా మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఉన్నారు. మరొకరు కాంగ్రెస్ పార్టీ పెద్దవూర మండలాధ్యక్షుడు. అనుముల మండలంలోని అధికార పార్టీ నేతలు కొందరు జట్టుగా ఏర్పడి కొంతకాలంగా రైతుల వద్ద తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి బినామీ రైతుల పేర ఐకేపీ కేంద్రాల్లో పోసి విక్రయిస్తున్నారు. ఇందులో కీలకంగా ఉన్న వ్యాపారి, కాంగ్రెస్ నాయకుడు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి అక్రమంగా లారీల్లో తీసుకొచ్చి బినామీ రైతుల పేరుతో ఇక్కడి ఐకేపీ కేంద్రాల్లో పోసి విక్రయిస్తున్నారు. బోనస్‌ను కాజేసే కుట్రలో భాగంగా అధికారులు సైతం రైతులను కాదని చెప్పి సదరు నాయకుడు సూచించిన వద్దనే మొదట కొనుగోలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల టాస్క్‌పోర్స్ అధికారులు నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని పలు ఐకేపీ కేంద్రాల్లో నిర్వహించిన తనిఖీల్లో అనేక విషయాలు వెలుగుచూశాయి. బోనస్ కోసం ఆంధ్రా నుంచి వచ్చిన ధాన్యం లారీలను అధికారులు సీజ్ చేశారు. తీగ లాగితే డొంక కదలడంతో శనివారం తెల్లవారుజామున టాస్క్‌పోర్స్ పోలీసులు అనుముల గ్రామానికి చెందిన సదరు ధాన్యం వ్యాపారి పిల్లి ఆంజనేయులతోపాటు మరో ముగ్గురుని, పెద్దవూర మండలానికి చెందిన అధికార పార్టీ నేతను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. వీరి అరెస్టుతో బినామీ రైతుల్లోనూ గుబులు మొదలైయ్యింది. కాగా.. రాజకీయ అండతోనే దందా సాగుతున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిందితులకు ఎమ్మెల్యే, ఎంపీలతో సత్సంబంధాలు ఉండడంతో పాటు చెక్‌పోస్టుల్లో పని చేసే అధికారులను మచ్చిక చేసుకుని రాత్రిళ్లు ఆంధ్రా నుంచి లారీల్లో అక్రమం ధాన్యం తీసుకువస్తున్నారని స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు క్షేత్రస్థాయిలో విచారిస్తే మరిన్ని అక్రమాలు వెలుగు చూడనున్నాయి.



అనంతారం కొనుగోలు కేంద్రంలో అదనపు కలెక్టర్ రాంబాబుతో మాట్లాడుతున్న రైతులు

# నెల రోజులైనా వడ్లు కొనరా?

- ఏసీ రూమ్‌లు వదలండి.. రైతుల కష్టాలు చూడండి
- అదనపు కలెక్టర్ రాంబాబును నిలదీసిన అనంతారం రైతులు

పెన్‌పహాడ్, మే 17 : 'ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోలేక నానా యాతన పడుతున్నాం. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను పేరుకే పెటినట్టు ఉంది. నెలరోజులైనా వడ్లు కొనకపోవడంతో ప్రైవేటులో వ్యాపారులకు తెగనమ్ముకోవాల్సి వస్తున్నది'అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెన్‌పహాడ్ మండలం అనంతారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని శనివారం అదనపు కలెక్టర్ రాంబాబు పరిశీలించేందుకు వచ్చారు. ధాన్యం రాశులను చూసి తాలు, మ్యాయిశ్చర్ సరిగ్గా శాతం ఉంటే మిల్లర్ల నుంచి ఇబ్బందులు రావని పేర్కొనడంతో రైతులు భగ్గుమన్నారు. అధికారులు లాలూచీ పడడంతో మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, తమ బతుకులను రోడ్డున పడేస్తున్నారని మండిపడ్డారు. అదనపు కలెక్టర్‌తోపాటు వచ్చిన తాసీల్దార్ లాలునాయక్, ఏపీఎం అజయ్‌నాయక్‌ను కలిపి నిలదీశారు. 'కేంద్రం నిర్వాహకుల నుంచి మొదలు పెడితే రైతులకు అన్నీ ఇబ్బందులే. ఓవైపు కాంటాలు అవడం లేదు. మరోవైపు పాత గన్నీ బస్తాల పేరుతో మిల్లర్లు మెలిక పెడుతున్నారు. మ్యాయిశ్చర్ వచ్చి కాంటాలు అయితే లారీలు రావట్లేదు. కటింగ్ పేరుతో మిల్లుల వద్ద కొర్రీ పెడుతున్నారు. క్వింటాకు ఇంతని తరుగుకు ఒప్పుకొంటేనే దిగుమతి చేసుకుంటున్నారు. ఈ ఘోరం ఎవరికి చెప్పుకోవాలి. ఉన్నతాధికారులు ఏసీల రూములు వదిలి వచ్చి రైతుల కష్టాలు చూడాలి. అప్పుడప్పుడు ఇలా వచ్చి అలా ఫొటోలు దిగి వెళ్లడం తంతుగా మారింది. నెలల రోజుల నుంచి మా వడ్లు కొనుగోలు కేంద్రంలోనే ఉన్నాయి. మా బాధలు పట్టవా?' అంటూ నిలదీయడంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.



చౌటుప్పల్‌లో నాణ్యతలేని డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల

# అభివృద్ధిపై పట్టింపేది?

- మంత్రి పదవిపైనే శ్రద్ధ.. సమస్యల పరిష్కారం కరువు
- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్, మే 17 : మునుగోడు నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కనీస సోయి లేదని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. ఆయనకు మంత్రి పదవి మీద ఉన్న ధ్యాస ఈ ప్రాంత సమస్యల పరిష్కారంపై లేదని లేదని విమర్శించారు. ఎమ్మెల్యే తుగ్లక్‌లా వ్యవహరిస్తుంటే.. పోలీస్ యంత్రాంగం బాధ్యత మరిచి ఆయనకు లోబడి బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నదని మండిపడ్డారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో నాణ్యతలేని డ్రైనేజీ పనులు, నత్తనడకన సాగుతున్న సర్వీసు రోడ్డు పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ పనుల వల్ల దుకాణాలు దుమ్ముతో నిండిపోతున్నాయని, షాపులను దులిపేందుకు సగం రోజు పడుతున్నదని వ్యాపారులు వివరించారు. డ్రైనేజీ నిర్మాణం పూర్తికాపోవడంతో వినియోగదారులు షాపులకు వచ్చే వీలు లేకుండా పోతున్నదని వాపోయారు. అంతకుముందు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ధాన్యపు రాశులను కూసుకుంట్ల పరిశీలించారు. ధాన్యం తెచ్చి 15 రోజులైనా కొనుగోలు చేడయం లేదని, 20 రోజుల కింద అమ్మిన ధాన్యానికి ఇంకా డబ్బులు అకౌంట్‌లో పడలేదని రైతులు తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల మాట్లాడుతూ ఈ ప్రాంత సమస్యల మీద ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి పట్టు లేదన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తీసుకొచ్చిన నిధులు తప్ప ఇప్పుడు నయాపైసా తీసుకురాలేదని విమర్శించారు. ఎమ్మెల్యేగా దోచుకోవడం, దాచుకోవడంపై ఉన్న ధ్యాస అభివృద్ధిపై లేదని ఆరోపించారు. ఈ ప్రాంత పరిశ్రమల నుంచి ఎమ్మెల్యే భజన బృందం కోట్ల రూపాయలు వసూలు చేస్తున్నట్లు పరిశ్రమ నిర్వాహకులు చెప్తున్నారని పేర్కొన్నారు. ఆ నిధులను రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖర్చుపెట్టి అభ్యర్థులను గెలిపించుకుంటామని చెప్తున్నారని దుయ్యబట్టారు. నిర్మాణ పనుల్లో కనీస నాణ్యత లేకపోతే కాంట్రాక్టర్ చర్యలు తీసుకోవాల్సింది పోయి.. పగుళ్లు పట్టాయని కాంట్రాక్టర్లను బెదిరించి ఇంటికి రప్పించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కనీసం మంచి నీటి సమస్య కూడా పరిష్కరించలేని స్థితిలో ఎమ్మెల్యే ఉన్నారని విమర్శించారు. తన హయాంలో మంచి నీటి ట్యాంకుల నిర్మాణం కోసం కోట్ల రూపాయలు తెస్తే ఇప్పటికీ పనులు పూర్తి చేయలేదన్నారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గిర్కటి నిరంజన్‌గౌడ్, నాయకులు పెద్దిటి బుచ్చిరెడ్డి, బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, ఢిల్లీ మాధవరెడ్డి, ముటుకుల్లోజు దయాకరాచారి, సుర్వి మల్లేశ్ గౌడ్, ఊడుగు మల్లేశంగౌడ్, తాడూరి పరమేశ్, ముప్పిడి శ్రీనివాస్ గౌడ్, దేవరపల్లి గోవర్ధన్‌రెడ్డి, తొర్పునూరి నర్సింహగౌడ్, సుర్కంటి శ్రీధర్‌రెడ్డి, కొత్త పర్వతాలుయాదవ్, ఆల్మాస్‌పేట కృష్ణ, కొయ్యడ శేఖర్‌గౌడ్, బాతరాజు యాదగిరి, పాక రమేశ్ యాదవ్, రమనగోని రఘు పాల్గొన్నారు.

# డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో తనిఖీలు



డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ బృందం

- వైద్యారోగ్య శాఖ అవినీతిపై రాష్ట్ర అధికారుల ఫోకస్
- 5 గంటల పాటు ఫైళ్ల తనిఖీ..
- హైదరాబాద్‌కు తీసుకువెళ్లిన అధికారులు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

సూర్యాపేట, మే 17 : సూర్యాపేట జిల్లా వైద్యారోగ్య శాఖలో జరుగుతున్న అక్రమాలు, అవినీతిపై నమస్తే తెలంగాణ దినపత్రికలో ఇటీవల ప్రచురితమైన వరుస కథనాలకు రాష్ట్ర అధికారులు స్పందించారు. శనివారం ఉదయం 11 గంటలకు జిల్లా వైద్యాధికారి కార్యాయానికి ఆకస్మికంగా వచ్చింది. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ , డిప్యూటీ సీఎస్ పీఓ డాక్టర్ సుమిత్రరాణి, వైద్యారోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ అడ్మిన్ డాక్టర్ శ్వేతా మోహన్‌తో కూడిన బృందం సాయంత్రం 4 గంటల వరకు రికార్డులను పరిశీలించింది. జిల్లాలో ఇటీవల ప్రైవేట్ ఆసుపత్రులకు ఇచ్చిన అనుమతి పత్రాలు, డాక్టర్ల సర్టిఫికెట్లు, మెడికల్ కౌన్సిల్ సీజ్ చేసిన హాస్పిటల్, స్కానింగ్ సెంటర్ల రికార్డులను బృందం సభ్యులు చూశారు. పలు రికార్డులను హైదరాబాద్‌కు తీసుకువెళ్లారు. నివేదికను వైద్యారోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ రవిచంద్రనాయక్‌కు అందించనున్నట్లు తెలిపారు. తదుపరి చర్యల కోసం ప్రిన్సిపల్ సెక్రటరీకి పంపించడం జరుగుతుందని డాక్టర్ రాథోడ్ పేర్కొన్నారు.

### చెమటలు పట్టించిన తనిఖీ బృందం

రాష్ట్ర వైద్యారోగ్య శాఖ బృందం సభ్యులు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలాన్ని ఎదురుగా కూర్చోబెట్టుకొని రికార్డులను పరిశీలించారు. వారు వేసే ప్రశ్నలకు డీఎంహెచ్‌ఓకు చెమటలు పట్టాయి. చాలా ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పోయారు. అక్రమాలు జరిగినట్లు రికార్డుల్లో గుర్తించిన అధికారులు వాటిని వెంట తీసుకువెళ్లడంతో ఏం చర్యలు తీసుకుంటారో, ఎవరెవరిపై వేటు పడుతుందోనని డీఎంహెచ్‌ఓ కార్యాలయం సిబ్బంది వణికి పోతున్నారు. కాగా, సూర్యాపేట జిల్లాలో ఆస్పత్రుల అనుమతులు, కొవిడ్ సమయంలో నిధుల దుర్వినియోగం, నిబంధలకు విరుద్ధంగా స్కానింగ్ సెంటర్లకు అనుమతులు, కీలక అధికారి అవినీతిని నమస్తే తెలంగాణ ప్రతిక వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చిన సంగతి తెలిసిందే.

## 25న ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు



సూర్యాపేట టౌన్, మే 17: చెస్‌లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి చేసిన సూచన మేరకు సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25న జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అండర్–11, 17 బాలబాలికల చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్, కార్యదర్శి ఎల్.సతీశ్ కుమార్ తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారిని హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు వెల్లడించారు. జిల్లా స్థాయి విజేతలకు షీల్డ్‌లు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు వివరించారు. చెస్ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి సతీశ్‌కుమార్‌ను 93947 53343 నంబర్‌లో సంప్రదించాలని శనివారం ఒక ప్రకటనలో సూచించారు.

## డీహెచ్‌టీటీ కోర్సుకు దరఖాస్తులు

భూదాన్‌పోచంపల్లి, మే 17 : డిప్లమో ఇన్ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ (డీహెచ్‌టీటీ)మూడేండ్ల కోర్సుకు ఈ విద్యా ఏడాది(2025–26)కి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, ప్రధాన కార్యదర్శి బొమ్మ హరిశంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుకు పదో తరగతి ఉత్తీర్ణత, మెరిట్ ఆధారంగా జనరల్ అభ్యర్థులకు 15 నుంచి 23 ఏండ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 15 నుంచి 25 ఏండ్ల వయస్సు గల వారు అర్హులని పేరొన్నారు. మొత్తం 60 మంది విద్యార్థుల కోసం దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు చెప్పారు. జూన్ నెలాఖరు వరకు విద్యార్థులు జిల్లా ఏడీ కార్యాలయంలో, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.




